సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం ı 7 ı సెప్టెంబర్ ı 2024



8న అథ్లెటిక్స్ సెలెక్షన్స్

తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 8న అథ్లెటిక్స్ జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు.

IIలో ▸



అంగన్‌వాడీ.. బోధన తడబడి

అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ స్కూల్ విద్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. మూడు నెలలైనా పుస్తకాలు సరఫరా చేయలేదు.

IIలో ▸



చేపల చెరువులు కొల్లేరు పాలు

కొల్లేరు వరద ఉధృతికి వందలాది ఎకరాల్లో చేపల చెరువులు నీటమునిగాయి. రూ.కోట్ల విలువైన చేపలు కొల్లేరు పాలయ్యాయి.

IIలో ▸

న్యూస్‌రీల్

న్యాయవాదుల విధుల బహిష్కరణ



కోర్టు వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

నరసాపురం: కేంద్ర ప్రభుత్వం న్యాయచట్టాల్లో మార్పులు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని నరసాపురం న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. న్యాయచట్టాల్లో మార్పులు తెచ్చేలా తీసుకుంటున్న చర్యలు, బిల్లులు ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు సముదాయం వద్ద ఆందోళన చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ మాట్లాడారు. సంఘ కార్యదర్శి రంపా పుల్లాజీ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థిని మృతి



పేదాడ మీనాక్షి (ఫైల్)

భీమడోలు: పూళ్ల హైస్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని పేదాడ మీనాక్షి (15) న్యూమోనియాతో పాటు మల్టీ ఆర్గాన్స్ దెబ్బతినడంతో గురువారం రాత్రి విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పూళ్ల పాత పోస్టాఫీసు రోడ్డు ప్రాంతానికి చెందిన మీనాక్షికి వారం క్రితం డెంగీ జ్వరం రావడంతో తల్లిదండ్రులు ఏలూరులో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడా జ్వరం తగ్గకపోవడంతో ఏలూరులోని ఆంధ్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ జ్వరం తగ్గినా న్యూమోనియా వల్ల ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడం, అంతర్గత అవయవాలు దెబ్బతినడంతో కాలేయం పనిచేయకపోవడంతో రెండు రోజుల క్రితం విజయవాడ ఆంధ్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మీనాక్షి మృతిచెందినట్టు తల్లిదండ్రులు నాగు, వెంకటలక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు. హైస్కూల్ హెచ్‌ఎం పి.భువనేశ్వరరావు, ఉపాధ్యాయులు మీనాక్షి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. ఆటలు, చదువులో చురుగ్గా ఉండే మీనాక్షి మృతిచెందడం బాధాకరమని సంతాపం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం నుంచి పాఠశాలకు సెలవు ప్రకటించారు. మృతురాలి ఇంటి ప్రాంతంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు ఇంటింటా సర్వే చేస్తామని వైద్యులు తెలిపారు.

మెనూ పటిష్టంగా అమలుచేయాలి

భీమవరం: పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పథకం మెనూ అమలుపై సమీక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

భీమవరం(ప్రకాశం చౌక్): వినాయక చవితి సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ చదలవాడ నాగరాణి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో విఘ్నాలు తొలగి పాడిపంటలతో, సుఖశాంతులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

10న ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఉండి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 10న ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరాజు ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్ 94928 85556, 94418 41622 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉద్యాన వర్సిటీలో శిక్షణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ కృషి విజ్ఞాన కేంద్రంలో అరటినారతో హ్యాండీ క్రాఫ్ట్స్ తయారీపై ఈనెల 9 నుంచి ఐదు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్టు డాక్టర్ కె.వెంకట సతీష్ తెలిపారు. సెల్ 98667 77777 నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ ద్వారా అనుమతి పొందాలన్నారు.

నరసాపురంలో పెరిగిన నీటిమట్టం

నరసాపురం: నరసాపురం వశిష్ట గోదావరిలో వరద ప్రవాహం రోజురోజుకూ పెరుగుతోంది. గురువారంతో పోలిస్తే శుక్రవారం నీటిమట్టం భారీగా పెరిగింది. నరసాపురానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న అంతర్వేది వద్ద గోదావరి నది సముద్రంలో కలుస్తుంది. గోదావరి వరద నీరు వేగంగా సముద్రంలో కలుస్తున్నా నరసాపురంలో నీటిమట్టం మాత్రం పెరుగుతూనే ఉంది. పట్టణంలోని లాకుపేట, పొన్నపల్లి, మాధవాయిపాలెం, నరసాపురం మండలంలోని కొత్త నవరసపురం, పాత నవరసపురం ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు. గోదావరి ఉధృతితో మాధవాయిపాలెం రేవు నుంచి పంటు రాకపోకలు వరుసగా మూడో రోజు కూడా నిలిపివేశారు.

జైజై గణేశా..



తాడేపల్లిగూడెంలో చవితి సందడి

ఏకదంతాయ.. వక్రతుండాయ.. గౌరీతనయా.. నమోనమః.. అంటూ గణనాథులు పూజలందుకునేందుకు సిద్ధమయ్యారు. ఊరూవాడా వినాయచవితి సందడి నెలకొంది. చవితి సామగ్రి విక్రయాలతో మార్కెట్లు కిటకిటలాడాయి. పత్రి, పూలు, పండ్లు, ప్రతిమలు, పూజా ద్రవ్యాల అమ్మకాలు జోరుగా సాగాయి.

– సాక్షి నెట్‌వర్క్



భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో విక్రయాలకు సిద్ధంగా విగ్రహాలు



భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో పండ్లు, పత్రి విక్రయాలు

సమస్యలకు వసతి

- ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో వెంటాడుతున్న సమస్యలు
- తాగునీరు, పారిశుద్ధ్య లేమితో ఇక్కట్లు
- కొన్నిచోట్ల భోజనం వడ్డించేవారు లేక విద్యార్థులే వడ్డన
- జిల్లాలో నాలుగు గురుకుల పాఠశాలలు, 35 ఎస్సీ, 29 బీసీ హాస్టళ్లు
- ఐదు నెలలుగా విడుదల కాని డైట్, కాస్మోటిక్ బిల్లులు
- రూ.1.46 కోట్ల మేర పేరుకుపోయిన బకాయిలు

జిల్లాలో సంక్షేమ వసతి గృహాలు సర్కారు నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతున్నాయి. సరిగా అమలుకాని మెనూ, పారిశుద్ధ్యలేమి, తలుపుల్లేని టాయిలెట్స్, తాగునీటి సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. మౌలిక వసతుల కొరతతో ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల ఆహారం వడ్డించేవారు కరువయ్యారు. నెలల తరబడి ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయక విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.



తాడేపల్లిగూడెం మండలం యాగర్లపల్లిలో శిథిల భవనంలో ఎస్సీ సంక్షేమ హాస్టల్

సాక్షి గ్రాండ్ రిపోర్ట్



నరసాపురం మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో నేలపై కూర్చొని భోజనాలు చేస్తున్న విద్యార్థులు

సాక్షి, భీమవరం: జిల్లాలో బీసీ సంక్షేమశాఖ పరిధిలో 19 బాయ్స్, 10 గరల్స్ హాస్టళ్లు ఉండగా, సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో 17 బాయ్స్, 18 గరల్స్ హాస్టళ్లు ఉన్నాయి. తాడేపల్లిగూడెం రూరల్ ఆరుగొలను, నరసాపురం రూరల్ ఎల్‌బీ చర్లలో గురుకుల కళాశాలలు ఉండగా, ఆచంటలో గురుకుల బాలికల పాఠశాల, తాడేపల్లిగూడెం రూరల్ పెదతాడేపల్లిలో గురుకుల బాలుర పాఠశాల ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఆయా వసతి గృహాల్లో 5,611 మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు.

వేధిస్తున్న సమస్యలు

- నరసాపురం రూరల్ ఎల్‌బీ చర్ల బాలుర గురుకుల పాఠశాలలో తాగునీటి సరఫరా సరిగా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు ఓవర్ హెడ్ ట్యాంకు లేకపోవడంతో తాగునీటి పైప్ లైన్ ఏర్పాటుచేశారు. కొందరు నాయకులు ఈ నీటిని గ్రామాలకు మళ్లిస్తుండటంతో కనీస అవసరాలు తీర్చుకునేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మూడు నెలల క్రితం పెదవేగికి చెందిన కొత్తపల్లి అభిషేక్ రెండు నెలల క్రితం 7వ తరగతిలో చేరగా తాగునీటి సమస్య కారణంగా ఆరోగ్యం దెబ్బతింటోందని ఇటీవల బాలుడి తండ్రి సత్యనారాయణ పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్లారు. ఇక్కడ పనిచేసే వారికి, వంట తయారు చేసే మహిళలకు ఐదారు నెలలుగా జీతాలు జమ కావడం లేదు.
- లక్ష్మణేశ్వరం కట్టా వారి మెరకలోని బీసీ బాలికల హాస్టల్ ఆవరణలో వర్షం నీరు నిలిచిపోయి అపారిశుద్ధ్యం నెలకొంది. ఇక్కడ 480 మంది విద్యార్థినులు ఉండగా వంట సిబ్బంది ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఎవరైనా సెలవు పెడితే వంట తయారీకి ఇబ్బంది పడాల్సి వస్తుంది. డైనింగ్ హాలులో టేబుళ్లు లేకపోవడంతో విద్యారినులు కింద కూర్చుని భోజనం చేస్తున్నారు. బీసీ బాలుర హాస్టల్‌లో 201 మంది విద్యార్థులకు కేవలం రెండు హాళ్లలో ఇరుగ్గా ఉండాల్సి వస్తోంది. టాయిలెట్స్ 14 మాత్రమే ఉండటంతో చాలడం లేదని విద్యార్థులు అంటున్నారు. వర్షం వస్తే హాళ్లు తడిచిపోయి ఇబ్బంది పడాల్సి వస్తోంది. నరసాపురం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో పారిశుద్ధ్యలేమి సమస్యలు విద్యార్థులను వెంటాడుతున్నాయి. టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాళ్లలోని ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్ ముందు చెత్తాచెదారంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. దుర్వాసన భరించలేకపోతున్నామని అక్కడి విద్యార్థులు వాపోతున్నారు.
- పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ రోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాయ్స్ హాస్టల్‌లో 265 మంది వరకు విద్యార్థులు ఉండగా తరచూ సిబ్బంది ఏదోపని అంటూ బయటకు వెళ్లిపోతున్నారని తెలుస్తోంది. ఒక్కోసారి ఆహారం వడ్డించే నాథుడు లేక తామే వడ్డించుకోవాల్సి వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు.
- భీమవరం పట్టణంలోని 8 హాస్టళ్లు ఉండగా అన్నింటిలో ఫర్నిచర్, బెడ్లు, సీలింగ్ ఫ్యాన్ల కొరత ఉంది. కొన్నిచోట్ల వెంటిలేషన్ సరిగా లేకపోవడంతో గదులు దుర్వాసన వస్తున్నాయి. 17వ వార్డు ఎస్సీ బాలికలు, 4వ వార్డులోని బీసీ బాలికల హాస్టళ్లలో డైనింగ్ హాలు ఏర్పాటుచేయాలి. అన్ని హాస్టళ్లకు బెడ్లు, బెడ్ షీట్ల కొరత ఉంది. సరిగ్గా వెలుతురు లేకపోవడంతో దుర్గంధం రాకుండా రూమ్ స్ప్రేలు ఏర్పాటుచేయాలి.
- పెంటపాడు మండలం పరిమెళ్ల బాలుర హాస్టల్, పెంటపాడు బాయ్, గరల్స్ హాస్టళ్లు శిథిలావస్థకు చేరకున్నాయి. తాడేపల్లిగూడెం పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్ అధ్వాన్న స్థితికి చేరి వర్షం వస్తే బురదగా తయారవుతోంది. ఆహారం రుచిగా ఉండడంలేదని విద్యార్థులు అంటున్నారు.
- వీరవాసరం మండలం కొణితవాడలోని బాలుర హాస్టల్‌కు వెళ్లే మార్గం సరిగా లేదు. బాలికల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. టాయిలెట్స్ సరిగా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.
- తణుకు రూరల్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌లోని వాటర్ ప్లాంట్ మూలకు చేరింది. రోజూ ప్రైవేట్ ప్లాంటు నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది. భవనం ఫ్లోరింగ్ బాగా దెబ్బతింది.
- పాతూరులోని ఎస్సీ, బీసీ బాలికల హాస్టళ్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎస్సీ బాలికల హాస్టల్‌లో 11 టాయిలెట్లకు గాను కొన్నింటికి తలుపులు లేక విద్యార్థినులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

జిల్లాలో వసతి గృహాలు

బీసీ హాస్టళ్లు	ఎస్సీ హాస్టళ్లు
29	35
విద్యార్థులు 1,910	విద్యార్థులు 1,461
గురుకుల పాఠశాలలు 2	గురుకుల కళాశాలలు 2

విద్యార్థులు : 2,240

ప్రభుత్వం నుంచి రావాల్సిన డైట్, కాస్మోటిక్ బిల్లు బకాయిలు రూ. 1.46 కోట్లు

పేరుకుపోయిన బకాయిలు

దాదాపు ఐదు నెలల కాలంగా ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లాలోని బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టళ్ల పరిధిలో మొత్తం రూ.1.46 కోట్ల బకాయిలు ఉన్నాయి. వీటిలో బీసీ హాస్టళ్లలో డైట్ బిల్స్‌కు సంబంధించి రూ.62.66 లక్షల బకాయిలు విడుదల కావాల్సి ఉండగా కాస్మోటిక్ బిల్లులు రూ.24.64 లక్షలు రావాల్సి ఉంది. ఎస్సీ హాస్టళ్లలో రూ.42 లక్షల మేర డైట్, రూ.17 లక్షల వరకు కాస్మోటిక్స్ బిల్లు రావాల్సి ఉంది.



నరసాపురం మండలంలోని మత్స్యకార గురుకుల పాఠశాలలో విద్యార్థుల వసతి గది



పాలకొల్లులోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులే వడ్డన చేస్తున్న దృశ్యం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆకివీడు: కొల్లేరు సరస్సు, గోదావరి తీర ప్రాంతాల గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల కలెక్టర్లు చదలవాడ నాగరాణి, కె.వెట్రి సెల్వి అన్నారు. వేర్వేరుగా ఉప్పుటేరు ప్రాంతాలను శుక్రవారం వారు పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. పశ్చిమ కలెక్టర్ నాగరాణి విలేకరులతో మాట్లాడుతూ గోదావరికి ఎగువన వరద ఉధృతి పెరిగిందని, లంక ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదముందన్నారు. విజయవాడ నుంచి బుడమేరు వరద నీరు కొల్లేరుకు చొచ్చుకురావడంతో ఈ ప్రాంతంలో అడుగు వరద నీరు పెరిగిందన్నారు. ముంపునకు గురవుతున్న ఆకివీడు సమతానగర్‌లోని వీమల్లు కాలనీ ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. ఇన్‌చార్జి ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, జిల్లా జలవనరుల అధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు ఉన్నారు.

అడ్డుగా గుర్రపుడెక్క : కొల్లేరు, ఉప్పుటేరులోకి వరద నీరు అధికంగా ప్రవహిస్తుందని, తీర గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని ఏలూరు కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. ఆకివీడులోని ఉప్పుటేరుపై ఉన్న రైల్వే వంతెన వద్ద, నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్ వంతెన వద్ద గుర్రపుడెక్క పేరుకుపోవడాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. వరద నీరు ఉప్పుటేరు నుంచి సముద్రంలోకి వెళ్లేందుకు గుర్రపుడెక్క, తూడు, కిక్కిస అడ్డుగా మారాయని, వీటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఆదేశించారు. ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, ఆర్డీఓ ఖాజావలి తదితరులు ఆమె వెంట ఉన్నారు.



సోమేశ్వరం వద్ద ట్రాక్టర్‌పై పర్యటిస్తూ ఉప్పుటేరును పరిశీలిస్తున్న ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి

మాజీ ఎమ్మెల్యే ఆర్‌ఎస్‌కు ఘన నివాళి

యలమంచిలి: నరసాపురం మాజీ శాసనసభ్యుడు, చించినాడ మాజీ సర్పంచ్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీపీఎం ఉద్యమ నిర్మాత రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) (98) అంత్యక్రియలు శుక్రవారం స్వగ్రామం చించినాడలో ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారామ్ ఆయన చితికి నిప్పు పెట్టారు. సీపీఎం నాయకులు, ఆర్‌ఎస్ అభిమానులు పెద్ద ఎత్తున ఎర్ర చొక్కాలు ధరించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆర్‌ఎస్ భార్య, పెద్ద కుమార్తె ఇప్పటికే మృతిచెందగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రముఖుల నివాళి

శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, ఖమ్మం మాజీ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎంపీ పి.మధు, సీపీఎం రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు, బి.బలరామ్, వి.వెంకట్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి విన్స్టన్‌బాబు తదితరులు ఆర్‌ఎస్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.



ఆర్‌ఎస్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

కనకాయలంక కాజ్‌వే పైకి వరద

యలమంచిలి: గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో కనకాయలంక వద్ద కాజ్‌వే నీటమునిగింది. ప్రస్తుతం కాజ్‌వేపై నుంచి నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. ప్రజల రాకపోకలకు అధికారులు నాలుగు ఇంజన్ పడవలు ఏర్పాటు చేశారు. కనకాయలంక గ్రామంలో శుక్రవారం జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి పర్యటించారు. పడవ మీద కాజ్‌వే దాటి గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. ప్రస్తుతం వరద పరిస్థితి అదుపులోనే ఉందని, వరద పెరిగితే పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా కాచి, చల్లార్చి, వడగట్టిన నీటిని మాత్రమే తాగాలన్నారు. అత్యవసరమైతేనే పడవల ద్వారా రాకపోకలు సాగించాలన్నారు. గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్‌లు మద్దా శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు ఇన్‌చార్జి తహసీల్దార్ బాజీ సత్యనారాయణ ఆయన వెంట ఉన్నారు.



కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

క్లుప్తంగా

విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీగా రామ్‌కుమార్



ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడిగా బి.రామ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడలో పనిచేస్తూ బదిలీలో భాగంగా జిల్లాకు ఏడీగా వచ్చారు.

యువకుడి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రేమ విఫలం కావడంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కేశబోయిన దుర్గారామ్ (18) డెలివరీ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తల్లి ఇటీవల ఉద్యోగం నిమిత్తం దుబాయ్ వెళ్లింది. దుర్గారామ్ పట్టణంలోని రామారావుపేటలో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. గురువారం విధులకు వెళ్లకపోవడంతో కొరియర్ యజమాని ఫోన్ చేశాడు. ఫోను తీయకపోవడంతో మరో యువకుడిని పంపించాడు. దుర్గారామ్ ఇంటికి వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. విషయం పోలీసులకు చెప్పడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. ప్రేమ వ్యవహారం విఫలం కావడంతో మనస్తాపానికి గురైన దుర్గారామ్ ఫ్యాను రాడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. 9 మందికి గాయాలు



నూజివీడు: ఆటో బోల్తాపడటంతో అందులో ఉన్న 9 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం నూజివీడు పట్టణంలో జరిగింది. పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీకి చెందిన 9 మంది మహిళా కూలీలు పనుల నిమిత్తం ఆటోలో బయలుదేరారు. విస్సన్నపేట రోడ్డులో ఉన్న భారత్ క్లే ప్రొడక్ట్ పెంకుల ఫ్యాక్టరీ వద్ద అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో ఇందులో ఉన్న రొంగలి చంద్రమ్మ, సప్పా రవణమ్మ, ఎస్.బల్లేరమ్మ, రొంగలి పెద్దమ్మ, చిట్టూరు కోటేశ్వరమ్మ, తెర్లి ఉష, ఎం.సూరమ్మ, షేక్ నాగూర్‌బీ, బత్తల గౌరికి గాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ క్షతగాత్రులకు వైద్యులు చికిత్స అందించారు.

చేపల చెరువులు కొల్లేరు పాలు

- నీట మునిగిన వందలాది చెరువులు
- లబోదిబోమంటున్న యజమానులు



పెదయాగనమిల్లిలో చెరువుల చుట్టూ వల కట్టిన దృశ్యం



కోమటిలంక పరిసరాల్లో చేపల చెరువుల పైనుంచి పారుతున్న వరదనీరు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో వందలాది చేపల చెరువులు నీట మునిగాయి. రూ.కోట్ల విలువైన చేపలు కొల్లేరు పాలయ్యాయి. మరోవైపు మరిన్ని చెరువులు ముంపు అంచున ఉన్నాయని చెబుతున్నారు. ఈ చెరువుల్లో చేపలను కాపాడుకునేందుకు యజమానులు నానా అగచాట్లు పడుతున్నారు. కొద్దిరోజులుగా కొల్లేరులోకి చేరుతున్న వరద ప్రవాహం సాగుదారులకు తీవ్ర నష్టం మిగిల్చింది.

భారీ వర్షాలతో పాటు తమ్మిలేరు, బుడమేరు నుంచి వస్తున్న వరదనీరు కొల్లేరు గ్రామాల పరిసరాల్లో చేపల చెరువులను ముంచింది. మూడు రోజుల క్రితం కలకుర్రులో సుమారు 100 ఎకరాల చేపల చెరువు నీట మునిగింది. ఈ చెరువులో చేపల విలువ సుమారు రూ.1.50 కోట్లు ఉంటుందని అంచనా. చేపలు కొల్లేరులోకి కొట్టుకుపోకుండా ముందు జాగ్రత్త చర్యగా యజమాని చెరువు చుట్టూ వల కట్టించాడు. అయినా ఫలితం లేకుండాపోయింది. దీంతో చేపలను మరో చెరువులోకి తరలించి కాపాడుకున్నారు. పెరిగిన వరద తాకిడికి కొత్త చెరువుకు సైతం గండ్లు పడ్డాయి. దీంతో కోట్ల విలువైన చేపలు వరదనీటిలో కొట్టుకుపోయాయి. శ్రీపర్రు శివారున కొల్లేరు పరిసరాల్లో 70 ఎకరాలు, 40 ఎకరాల చెరువులు నీట మునిగాయి. ఇందులో చేపల విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందని అంచనా. వీటి యజమానులు 3 నెలల క్రితం లక్షల రూపాయలు ఖర్చు పెట్టి చేప పిల్లలు కొని చెరువులో వేశారు. కోమటిలంకలో 150 ఎకరాల విస్తీర్ణంలో నాలుగు చెరువుల్లో పెంచుతున్న చేపలు, రొయ్యలు కొల్లేరు పాలు అయ్యాయి. గుడివాకలంక, పెదయాగనమిల్లి మధ్య పదుల సంఖ్యలో చెరువులను వరదనీరు ముంచేసింది. ఈ చెరువుల మీదుగా వరద ప్రవాహం ఉధృతంగా ఉండడంతో యజమానులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. అనేక బెల్ట్ గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో చెరువులు ముంపు అంచుకు చేరాయి. ఈ చెరువుల గట్లకు ఒక్క అడుగు కింద నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. వీటి యజమానులు చెరువుల చుట్టూ వల కట్టుకున్నారు. గట్లకు గండి పడకుండా మట్టి, ఇసుక బస్తాలతో పటిష్టపరుస్తున్నారు.

10 వేల ఎకరాల్లో చేపల చెరువులు

ఏలూరు రూరల్ మండలం కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు, గుడివాకలంక, కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, పెదయాగనమిల్లి, కోమటిలంక, కలకుర్రు గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో చేపలు, రొయ్యల సాగు జరుగుతోంది. ఇవి కాక అభయారణ్యంలో అనుమతి లేకుండా తవ్విన మరిన్ని చెరువుల్లో సైతం చేపల పెంపకం సాగుతోంది. రోజురోజుకు సరస్సును వరద ముంచెత్తుతుండడంతో సాగుదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వరదలతో తీవ్రంగా నష్టపోయాం



కొల్లేరుకు వచ్చిన వరదతో చెరువులు మునిగిపోయాయి. మరిన్ని చెరువులు అడుగు దూరంలో ఉన్నాయి. వరద పెరిగితే మరింత నష్టం జరుగుతుంది. చేపల కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాం. మా ప్రయత్నాలు ఫలించడం లేదు.

– నాగప్రసాద్, కలకుర్రు

పూడ్చలేని నష్టం



వరద వల్ల కొల్లేరు గ్రామాలు తీవ్రంగా నష్టపోయాం. పదుల సంఖ్యలో చెరువుల్లోకి వరదనీరు చేరింది. కోట్ల రూపాయలు విలువైన చేపలు కొట్టుకుపోతున్నాయి. చెరువు యజమానులు తీవ్రంగా నష్టపోతారు. వరద అడుగు ఎత్తు పెరిగితే మరిన్ని చెరువులు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.

– రుక్మానంద మహరాజ్, గుడివాకలంక

10న త్రోబాల్ సెలెక్షన్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): అండర్ 19 జిల్లా త్రోబాల్ సెలెక్షన్స్ పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు జిల్లా త్రో బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ఏఆర్‌కే వర్మ, జనరల్ సెక్రటరీ శ్రీనాథ్ తెలిపారు. ప్రతిభ చూపిన వారిని ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలోని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారు అక్టోబర్ 3 నుంచి 5 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఆధార్ కార్డు, పుట్టిన తేదీ జిరాక్స్‌లు, పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 97012 03030, 72879 65417 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

8న అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

తణుకు అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చింతకాయల సత్యనారాయణ, సంకు సూర్యనారాయణ తెలిపారు. తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఉదయం 8 గంటలకు అండర్ 14, 16, 18, 20, 23 విభాగాల్లో బాల బాలికలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14 నుంచి 16వ తేదీవరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని వివరించారు. ఇతర వివరాలకు 8247260545 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



ఖైదీలతో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. స్థానిక కోటదిబ్బలోని జిల్లా కేంద్ర కారాగారాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కారాగారంలో ఖైదీలకు అందిస్తున్న వసతులపై సమీక్షించారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల శుభ్రత వైద్య సదుపాయాలపై ఆరాతీశారు. ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందజేస్తున్న ఉచిత న్యాయ సాయంపై అవగాహన కల్పించారు. కారాగారంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాలు పొందడంలో ఏ ఇతర పరిస్థితుల్లో గాని న్యాయ సహాయం కావాల్సినా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తుందని తెలిపారు.

పోక్సో కేసులో యావజ్జీవ శిక్ష

కామవరపుకోట: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవిత ఖైదు శిక్ష ఖరారు చేస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.సునంద శుక్రవారం తీర్పు వెలువరించారు. జీవిత ఖైదుతో పాటు రూ.5 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి నష్ట పరిహారం కింద రూ.3 లక్షలు చెల్లించాలని తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం తడికలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెమటపాము రమేష్ పోక్సో కేసులో అరెస్టయ్యాడు. నేరం రుజువు కావడంతో పోక్సో యాక్ట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.సునంద జీవిత ఖైదు విధించారు. 2014 ఫిబ్రవరి 7న రమేష్ చెల్లెలి వరసైన బాలికపై అత్యాచారం చేశాడు. అనంతరం గ్రామం నుంచి పారిపోయాడు. బాధితురాలు విషయం తల్లితో చెప్పగా వారు తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అప్పటి సీఐ దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కి పంపారు.

నరసాపురంలో ఆన్‌లైన్ మోసం

రూ.10 లక్షలు పోగొట్టుకున్న యువతి

నరసాపురం : పట్టణంలోని రుస్తుంబాదకు చెందిన చింతపల్లి హాసిని అనే యువతి ఆన్‌లైన్ మోసానికి గురై రూ.10 లక్షలు పోగొట్టుకున్న ఘటన నరసాపురం పట్టణంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పట్టణ ఎస్ఐ జయలక్ష్మి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డిగ్రీ పూర్తి చేసుకొని ఉద్యోగ వేటలో ఉన్న హాసినికి ఇన్‌స్టాగామ్‌లో పాటిల్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి ఆన్‌లైన్‌లో మెసేజీల ద్వారా ఆమెను నమ్మించాడు. రూ.10 లక్షలు కావాలని డిమాండ్ చేయడంతో ఫోన్‌పే ద్వారా పాటిల్ సూచించిన కొన్ని అకౌంట్లకు రూ.10 లక్షల 15 వేలు జమ చేసింది. ఆ తర్వాత రోజులు గడుస్తున్నప్పటికీ స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ జయలక్ష్మి తెలిపారు.

మహిళా దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రవణ్ కుమార్

ఏలూరు (అర్ఆర్‌పేట) : గుండుగొలనులో దొంగతనాలకు పాల్పడుతున్న మహిళా దొంగను అరెస్ట్ చేసినట్లు ఏలూరు డీఎస్పీ డీ. శ్రావణ్ కుమార్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. భీమడోలు మండలం గుండుగొలను వైఎస్ఆర్ కాలనీలో రెండేళ్ల క్రితం ఇల్లు నిర్మించుకుని అక్కడే ఉంటున్న మూడెడ్ల శ్రీదేవి విలాసాలకు అలవాటు పడింది. తన విలాసాల కోసం అదే కాలనీలో చోరీలకు పాల్పడేది. తాళం వేసిన ఇళ్లు లక్ష్యంగా దొంగతనాలు చేసేది. కాలనీలో ఒక ఇంట్లో దొంగతనం చేసి బంగారు ఆభరణాలను ఏలూరు విక్రయించడానికి వెళ్తున్న శ్రీదేవిని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ వై.సుధాకర్ అరెస్ట్ చేశారు. ఆమె నుంచి రూ.4.47 లక్షల విలువైన 70 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

పక్కాగా ఈ-ఫిష్ నమోదు



కేశవరంలో ఈ-ఫిష్, ఈ-క్రాప్‌పై అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్

గణపవరం : ఈ-ఫిష్ నమోదులో ఎలాంటి తప్పులకు తావులేకుండా పక్కాగా పూర్తిచేయాలని, లేదంటే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం గణపవరం మండలం కేశవరంలో ఆయన ఈ-ఫిష్, ఈ-క్రాప్, ఈ-కేవైసీ తదితర విషయాలపై అధికారులతో సమీక్షించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో కొన్ని సర్వే నంబర్లలో వరి పొలాలకు బదులు ఆక్వా చెరువులు, మరికొన్ని నెంబర్లలో చెరువులకు బదులు వరిపొలాలు ఉన్నట్లు గుర్తించిన జేసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

పెంటపాడు: అలంపురం వద్ద మిడ్‌లెవల్ కాలువలో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన పురుషుడి మృతదేహం గుర్తు పట్టలేనంతగా ఉందని ఎస్సై స్వామి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీ.. బోధన తడబడి

- చిన్నారులకు అందని కొత్త పుస్తకాలు
- మూడు నెలలుగా పాత పుస్తకాలతోనే కాలక్షేపం



అంగన్‌వాడీ కేంద్రంలో పాత పుస్తకాలతో కుస్తీ పడుతున్న చిన్నారులు

భీమడోలు: అంగన్‌వాడీల్లోని ప్రీ స్కూలు విద్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాలు పునఃప్రారంభించి మూడు నెలలు గడిచినా ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదు. ఎప్పుడు సరఫరా చేసేదీ స్పష్టమైన ప్రకటన లేదు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలతోనే బోధన చేయాల్సిన దుస్థితి. బాల్య దశలోనే విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఇంగ్లిషు మీడియంలో చిన్నారులు జిజ్ఞాసను పెంచేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీల్లోని చిన్నారులకు ఆట పాటలతో కూడిన బొమ్మల పుస్తకాలను అందించింది. అప్పట్లో ఏటా వేసవి సెలవుల తర్వాత కేంద్రాలు పునఃప్రారంభించిన కొన్ని రోజులకే పాఠ్యపుస్తకాలను అందించింది. అయితే కొత్త ప్రభుత్వం పగ్గాలు పట్టగానే వాటిని మరిచింది.

ఏలూరు జిల్లాలో 10 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,225 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 3 నుంచి 5 ఏళ్ల లోపు చదువుకుంటున్న చిన్నారులు 33,826 మంది ఉన్నారు. గత ప్రభుత్వం చిన్నారుల వయసు, వారి సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని పీపీ 1, పీపీ 2 కిట్లను అందించేది. పిల్లలో ఆసక్తిని పెంచే కృత్యాధార బోధనను అమలు చేసింది. ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల చేరిక సంఖ్య గణనీయంగా పెరిగేది. 3 ఏళ్ల దాటి 4 ఏళ్ల లోపు చిన్నారులకు పీపీ 1 కిట్‌లో ఇంగ్లీషు, లెక్కలు, స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాయింగ్ పుస్తకాలను అందించారు. పీపీ 2 కిట్‌లో ఇంగ్లిషు, లెక్కలు, స్పోకెన్, డ్రాయింగ్ పుస్తకాలను 4 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు అందించారు. పిల్లల్లో వివిధ అభ్యసనా అంశాలను అంచనా వేసేందుకు ఉపయోగించే కార్డులను అందించేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు పుస్తకాలు అందించకపోవడంతో తల్లిదండ్రులు చిన్నారులను ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు.

పది రోజుల్లో కొత్త పుస్తకాలు



అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పది రోజుల్లో పుస్తకాలు రానున్నాయి. ప్రస్తుతం పాత పుస్తకాల ద్వారానే బోధన కొనసాగిస్తున్నాం. చిన్నారులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాం. త్వరలో పాఠ్య పుస్తకాల సమస్యలు పరిష్కారమవుతాయి.

– కేపీవీఎల్ పద్మావతి, ఐసీడీఎస్, పీడీ, ఏలూరు

అధిక వర్షాల వేళ.. పంట సంరక్షణ ఇలా..

ఏలూరు (మెట్రో): ఇటీవల కురిసిన అధిక వర్షాలకు జిల్లాలోని పలు గ్రామాల్లో వరి పంట ముంపుబారిన పడింది. అయితే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే పంటను సంరక్షించుకోవచ్చని ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబు, సమన్వయకర్త డాక్టర్ కె.ఫణి కుమార్ తెలిపారు. జూలైలో అధిక వర్షాల వలన ఎండాకు, మాగుడు, ఆకుముడత తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు.

పిలకల దశలో చేను మునిగితే..

వరి పంటలో పిలకల దశలో సాధారణ రకాలు 5 రోజుల వరకు నీట మునిగినా బతికే అవకాశం ఉంది. ముంపును తట్టుకునే రకాలైన ఎంటీయూ 1140, ఎంటీయూ 1172, ఎంటీయూ 1223, ఎంటీయూ 1064, పీఎల్ 1100 రకాలు వారం పాటు ముంపును తట్టుకుంటాయి. అలాగే ఆకులు పైకి కనిపిస్తూ 30–40 సెంటీమీటర్ల నీరు నిలబడే మధ్యస్థ ముంపునకు గురై పల్లపు ప్రాంతల్లో ముంపునీటిని తట్టుకుంటాయి. ఎంటీయూ 1232 రకం 10–12 రోజుల పాటు తాత్కాలిక ముంపును తట్టుకుంటుంది. పిలకలు దశలో వరి పంట మునిగితే నీరు బయటకు పోయిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలి.

తెగుళ్ల గుర్తింపు.. నివారణ

అధిక, ఎడతెరిపి లేని వర్షాలు కురిసే ప్రాంతాల్లో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంది. తెగులు నిర్ధారణ కోసం ఎండిన ఆకులను ముక్కలుగా కత్తిరించి మంచి నీటితో ఉన్న గాజుగ్లాసులో వేయాలి. అరగంట తరువాత నీటిని గమనించినట్లయితే, తెగులు ఆశించిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి ప్రవేశించడం వల్ల నీటి గాఢత పెరగడం, పసుపు రంగుకు మారడం జరుగుతుంది. ఈ లక్షణాలను బట్టి ఆ పంటను బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించినట్లుగా గుర్తించాలి. ఈ తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో నిలిచిన నీటిని 2 – 3 సార్లు మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీసివేసి కొత్త నీరు పెట్టడం వల్ల ఉధృతి తగ్గుతుంది. సిఫారసు చేసిన పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లువేసే సమయంలోనూ, చిరుపొట్ట దశలోనూ వేయాలి. తెగులు సోకిన పొలానికి నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. ముఖ్యంగా బీపీటీ 5204, ఎంటీయూ 1121, ఎంటీయూ 1318 రకాలకు నత్రజని నియంత్రించాలి.

పాముపొడ..

వరిపై పాము పొడ తెగులు ఆశిస్తే దీని నివారణకు లీటరు నీటికి 2.0 మి.లీ హెక్సాకొనజోల్ 5 శాతం ఈసీ లేక 2.0 మి.లీ వాలిడామైసిన్ 3 లీటర్లు లేక 1.0 మి.లీ ప్రోపికొనజోల్ 25 శాతం ఈసీ లేక 0.4 గ్రా ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 25 శాతం, టెబుకొనజోల్ 50శాతం డబ్ల్యూజీ లేక 1.5 మి.లీ అజాక్సీస్ట్రోబిన్ 11శాతం, టెబుకొనజోల్ 18.3 శాతం ఎస్‌సీ లేక 1.0 మి.లీ అజాక్సీస్ట్రోబిన్ 25 శాతం ఎస్‌సీ మందులలో ఏదో ఒక దాన్ని 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు మార్చి పిచికారీ చేయాలి.

ఆకుముడత..

ఆకుముడత నివారణకు లీటరు నీటికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరాటరిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. చిరు పొట్ట దశలో ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా క్లోరాన్ట్రనిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు వేసుకోవాలి. దోమ ఎక్కువగా ఆశించే ప్రాంతాలో ఈ పురుగుల నివారణకు ప్రోఫెనోఫాస్, ట్రైజోఫాస్, క్లోరోపైరిఫాస్, మోనోక్రొటోఫాస్, సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు పిచికారీ చేయకూడదు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహించాలి



రాష్ట్ర ఉమ్మడి పరీక్షల నిర్వహణ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డిని కలిసిన అపుస్మా నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పరీక్షల నిర్వహణ విషయమై ప్రభుత్వ ఆదేశాల మేరకే ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని రాష్ట్ర ఉమ్మడి పరీక్షల కార్యనిర్వహణ డైరెక్టర్ ప్రతాప రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆయన శుక్రవారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) నాయకులతో సమావేశమయ్యారు. ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ పరీక్షల షెడ్యూల్‌ను అనుసరించాలని, పరీక్షలకు సంబంధించిన మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పరీక్ష ప్రశ్నాపత్రాలను యాజమాన్యాలే సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని, వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, స్వీయ పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థుల దేహదారుఢ్యం కోసం కనీసం ఇండోర్ గేమ్స్ ప్రోత్సహించాలని కోరారు. పదవ తరగతి హిందీ సిలబస్ విషయమై ప్రభుత్వం పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అపుస్మా నాయకులు ఎంబీఎస్ శర్మ, ఏ.మోహనరావు, ఏలూరు జిల్లా సెక్రటరీ ఎన్ఆర్‌కేప్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తుకు భరోసా

పెదవేగి: క్రీడల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పెదవేగి ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గురుకుల పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి అండర్ 19 క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలలో రాణించాలంటే ప్రతి రోజు సాధన చేయడం ఎంతో అవసరమని తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, కోకో తదితర క్రీడలలో ఎంపికలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఆచార్యులు, కళాశాల పీడీ కే జయరాజు, పీఈటీ గురుమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



మృతురాలు మరియమ్మ

ద్వారకాతిరుమల: విద్యుత్ షాక్‌కు గురై ఒక మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పోతేపల్లి గ్రామానికి చెందిన నిట్టా మరియమ్మ(58) స్థానిక గోద్రెజ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వద్ద చిన్న షెడ్డులో హోటల్ నిర్వహిస్తోంది. ఉదయం హోటల్‌లో పనిచేసుకుంటున్న ఫ్రిజ్ వైరు తొక్కింది. ఆ వైరును ఎలుకలు కొట్టడంతో విద్యుత్ షాక్ గురైన ఆమె కుప్పకూలి పడిపోయి, అక్కడికక్కడే మృతి చెందింది. మరియమ్మకు ఒక కుమారుడు, ఒకకుమార్తె సంతానం కాగా ఇద్దరికీ వివాహాలయ్యాయి. కుమార్తె బట్టు సుమలత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులకు సత్కరిస్తున్న సాహితీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం అధ్యక్షుడు మండా బ్రాహ్మజీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోదావరి ప్రభాకర్ శాస్త్రి, చింతకాయల సత్యనారాయణ, జంధ్యాల పద్మావతి, కవురు శారద, మాడభూషి జ్యోతి కుమారి, హరిబాబులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షుడు ఈతకోట తాతాజీ, పైలు శ్రీనివాస్, ఎం.నాగేంద్ర, జంధ్యాల నాగేశ్వరరావు, పీటీ వెంకన్న, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం


ప్రత్యేక వాహనంలో ఆహార పొట్లాలను తరలిస్తున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ) : విజయవాడ వరద బాధితులకు సాయం అందించేందుకు లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సంస్థ ముందుకు వచ్చింది. శుక్రవారం అంబాపురం, సింగ్‌నగర్ ప్రాంతాలకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు సతీష్, త్రిషారావు, సుభద్ర, రాజులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటిద్దామని తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులలోను శుక్రవారం రెగ్యులర్ శానిటేషన్‌తో పాటుగా దోమల నిర్మూలనలో భాగంగా ఫాగింగ్, మురుగు నీటి గుంటలలో ఆయిల్ బాల్స్ వేయడం, ఇతర శానిటేషన్ కార్యక్రమాలు జరిగాయి. వార్డులలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం న్యాయస్థానాల సముదాయంలో ఈనెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు భీమవరం పోక్సో కోర్టు స్పెషల్ న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ చెప్పారు. ప్రతి కోర్టులో న్యాయమూర్తి, న్యాయవాది సభ్యునితో బెంచ్ ఏర్పాటు చేస్తామని నాలుగు బెంచ్‌లు మండల న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్ డి సత్యవతి ఏర్పాటు చేశారన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కోర్టుల్లో పెండింగులో కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలన్నారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు జాతీయ లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని సోమశేఖర్ కోరారు.

తణుకులో తెలంగాణ గణనాథుడి విగ్రహాలు


కొచ్చెర్లకోట వారి వీధిలో కొలువుతీరిన 20 అడుగుల గణనాథుడు


ఆపిల్ ఆస్పత్రి సమీపంలో కొలువుతీరిన తెలంగాణ గణనాథుడు


సజ్జాపురం రామాలయం వీధిలో కొలువుతీరిన తెలంగాణ గణనాథుడు

- 20 అడుగుల భారీ విగ్రహాలు...
- కనులవిందుగా కమనీయమైన రూపాలు
- విగ్రహాలు చూసేందుకు తరలివస్తున్న భక్తులు

తణుకు అర్బన్: వినాయకచవితి మహోత్సవాలకు తణుకులోని విఘ్నేశ్వర స్వామి ఆలయాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలు ముస్తాబులు పూర్తి చేసుకున్నాయి. ఆలయాలు, మండపాల వద్ద ఇప్పటికే విద్యుత్ దీపాల వెలుగులు విరజిమ్ముతున్నాయి. అయితే తణుకులో ప్రధానంగా నిర్వహించే మూడు మండపాల్లో మాత్రం కొన్నేళ్లుగా తెలంగాణ గణనాథుడి బారీ విగ్రహాలు కొలువుతీరుతున్నాయి. సుందరంగా తీర్చిదిద్దబడుతున్న ఈ విగ్రహాల కోసం మండపాలు కూడా అంతే ఆకర్షణగా రూపుదిద్దుతున్నారు. విగ్రహాలకు తగ్గట్లుగా మండపాల అలంకరణకు తోడు పూజాధికాలు కూడా శాస్త్రోక్తకంగా నిర్వహిస్తున్నారు. ఈ భారీ గణనాథుడి విగ్రహాలను తిలకించి పూజాధికాలు నిర్వహించేందుకు స్థానికులే కాకుండా తణుకు చుట్టుపక్కల ఉన్న పలు గ్రామాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. గణనాథుడి రూపాలను కనులారా చూసేందుకు తొమ్మిదిరోజులపాటు ఈ మండపాలు భక్తుల తాకిడికి కిక్కిరిసిపోతాయి. గణనాథుడితో పాటు ఇతర దేవతామూర్తుల రూపాలు కూడా విగ్రహాలపై సుందరంగా తీర్చిదిద్దుతారు.

గణనాథుడి విగ్రహాలు ఇలా..

తణుకు పాపారావు పెట్రోలు బంక్ వెనుక ప్రాంతంలోని కొచ్చెర్లకోట వారివీధిలో శ్రీలక్ష్మి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 15వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది 20 అడుగుల భారీ విగ్రహాన్ని తెలంగాణ నుంచి తీసుకువచ్చారు. విగ్రహం ఖరీదుతో పాటు ట్రాన్స్‌పోర్ట్‌కు కలిపి మొత్తం రూ. 2లక్షలు కమిటీ సభ్యులు వన్నెంరెడ్డి నాని సమకూర్చారు. తణుకు సజ్జాపురంలోని రామాలయ ప్రాంతంలో లక్ష్మి గణపతి యూత్ కమిటీ ఆధ్వర్యంలో13వ వార్షికోత్సవంలో భాగంగా తెలంగాణలోని ధూల్‌పేట నుంచి రూ. 1.90 లక్షలతో 17 అడుగుల విగ్రహాన్ని కమిటీ ఆధ్వర్యంలో సమకూర్చారు. తణుకు ఆపిల్ ఆస్పత్రి సమీపంలో శ్రీబాల గణపతి యూత్ ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న 5వ వార్షికోత్సవంలో భాగంగా తెలంగాణలోని ధూల్‌పేట నుంచి 15 అడుగుల విగ్రహాన్ని ట్రాన్స్‌పోర్ట్‌తో కలిపి పట్టణానికి చెందిన మాకిరెడ్డి రాంబాబు, దేవి దంపతుల సౌజన్యంతో రూ. 1.30 లక్షలతో సమకూర్చారు. ఈ మూడు మండపాల్లోను ప్రతి ఏటా విగ్రహాలను తెలంగాణలోని ధూల్‌పేటలో తయారుచేసే ప్రాంతం నుంచి తణుకుకు తీసుకువస్తున్నారు. తణుకు నుంచి ప్రత్యేక వాహనాలను తీసుకువెళ్లి ఎంతో వ్యయప్రయాసలు కూర్చి విగ్రహాలను తీసుకువస్తున్నారు. దారి పొడవునా ట్రాఫిక్ ఇబ్బందులే కాకుండా విద్యుత్ తీగలను తప్పించుకుంటూ కేవలం రావడానికి రెండురోజులకుపైగా తమ ప్రయాణం సాగుతుందని వివరించారు.

అందమైన గణనాథుడి రూపం కోసమే



తెలంగాణలోని ధూల్‌పేటలో గణనాథుడి విగ్రహ రూపాలు చాలా అందంగా ఉంటాయి. ఏ విగ్రహం కొనాలో తెలియని పరిస్థితుల్లో ఒక విగ్రహాన్ని మించి మరొక విగ్రహం ఉంటుంది. అందమైన గణనాథుడి రూపం మా సజ్జాపురం మండపంలో ఉండాలనే ఉత్సాహంతో మేము గత మూడేళ్లుగా తెలంగాణ వెళ్లి విగ్రహం కొనుగోలు చేసి తీసుకువస్తున్నాము.

– నల్లి మణికంఠ, సజ్జాపురం

గణనాథుడే నాకు అవకాశం ఇచ్చాడని అనుకుంటా



తణుకు ఆపిల్ ఆస్పత్రి ప్రాంతంలో శ్రీబాల గణపతి యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే వినాయకచవితి వేడుకలకు ప్రతి ఏటా తెలంగాణ నుంచి విగ్రహం తీసుకువస్తున్నారు. ప్రతి ఏడాది కమిటీ సభ్యుల కోరిక మేరకు ఎంత వ్యయమైనా సరే విగ్రహానికి అయ్యే ఖర్చును సమకూరుస్తాను. గణనాథుడే నాకు ఆ అవకాశం ఇచ్చినట్లుగా భావిస్తాను.

– మాకిరెడ్డి రాంబాబు, తణుకు

పర్యావరణ హితానికే మట్టి విగ్రహాలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారుచేసిన విగ్రహాలు పూజించాలని లయన్స్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. గణపతి నవరాత్రులు సందర్భంగా స్థానిక రామచంద్రరావుపేటలోని బృందావనం వద్ద పేరిచర్ల ఫౌండేషన్, డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యక్షుడు వేగేశ్న రామరాజు సౌజన్యంతో మట్టితో తయారు చేసిన 400 గణపతి ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునగాల జితేంద్ర కుమార్, చెన్నారెడ్డి సతీష్, కుందుం వెంకటేశ్వరరావు, ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని పాతూరు యూత్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుడు ప్రతిమలను శుక్రవారం వినాయకుని గుడి వద్ద పంపిణీ చేశారు. శ్రీరంగం అంజిబాబు, సుంకర ధనబాబు, సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ఏలూరు రోడ్డు శ్రీదేవి మహంకాళమ్మ తల్లి ఆలయం వద్ద నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలను, వ్రతకల్ప పుస్తకాలను పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలే మేలు

తణుకు అర్బన్: పర్యావరణ పరిరక్షణకు వినాయకచవితి మహోత్సవాల్లో మట్టితో తయారు చేసిన గణనాథుడి ప్రతిమనే ఉపయోగించాలని రెడ్డి జన సంఘం అధ్యక్షుడు డి.వెంకటరెడ్డి అన్నారు. తణుకు సూర్యాలయం వీధిలో పతంజలి యోగా కల్చరల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కర్రి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీలో ఆయన మాట్లాడారు. వివిధ రకాల రంగులు, సిమెంట్‌లు వాడుతున్న విగ్రహాల వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అన్నారు. యోగా గురువు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా మట్టి వినాయక ప్రతిమలు భక్తులకు అందజేస్తున్నట్లు తెలిపారు. 500 మంది భక్తులకు ప్రతిమలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగాభ్యాసకులు గోపాల్, రమాకృష్ణ, వెంకటేశ్వరరావు, సూర్యనారాయణరాజు, రాహుల్, ఎం.రంగనాధరెడ్డి, టీపీ నాగిరెడ్డి, వి.రమాసత్యశ్రీ పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం (టీటీసీ) : మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం


తణుకు అర్బన్ : మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న దృశ్యం


తణుకు : మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ


తాడేపల్లిగూడెం (టీటీసీ) : మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

తణుకు: చవితి సందర్భంగా ప్రజలందరూ మట్టి గణపతి ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. తణుకు మైత్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని పట్టణ వాసులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లతుతూ పర్యావరణాన్ని రక్షించే విధంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా, జనసేన, బీజేపీ నాయకులు, మైత్రి లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

శశిలో మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాలలో వినాయక చవితి సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్, రెడ్ యాంట్ వాలంటీర్ విద్యార్థులు ఆధ్వర్యంలో కళాశాల యాజమాన్యం సహకారంతో మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి ఉచితంగా ప్రజలకు, కళాశాల విద్యార్థులకు అందజేశారు. కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల్ కృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్, కోఆర్డినేటర్లు వేణు, సల్మాన్ భాషా, దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- నేడు మండపాల్లో కొలువుతీరనున్న విఘ్నేశ్వరుడు
- 3 నుంచి 11 రోజుల పాటు ఉత్సవాలు
- వరద కారణంగా పెరిగిన పూలు, పండ్ల ధరలు
- కొనుగోలుదారులతో కిటకిటలాడిన గూడెం మార్కెట్

తాడేపల్లిగూడెం రూరల్: విఘ్నాలను తొలగించే గణనాథునికి ధరాఘాతం తప్పలేదు. ఈ ఏడాది వినాయక చవితి పూజకు వినియోగించే సామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి. పాలవెల్లి 50 నుంచి 150రూపాయలు, గొడుగు 20 నుంచి 80 రూపాయలు, డజను అరటి పండ్లు రూ.60లు, కొబ్బరికాయలు డజను రూ.30లు, చామంతి పువ్వులు 100 గ్రాములు రూ.60లు, పత్రి 20 నుంచి 60రూపాయలు, ఎలక్కాయ రూ.10లు, మారేడు కాయ రూ.10లు, మొక్కజొన్న పొత్తు రూ.10లు, నారింజ రూ.10లు ధరలు పలికాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధరలు విపరీతంగా పెరిగాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు అరటి తోటలు నేలకొరడంతో అరటి పండ్ల ధరలు భారీగా పెరిగాయి. ఈ ఏడాది వచ్చే తొలి పెద్ద పండుగ కావడంతో కొనుగోలుదారులు తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేసి పండుగను మమ అనిపించేందుకు సిద్ధమయ్యారు. భౌగోళిక కేంద్రంగా తాడేపల్లిగూడెం ఉండటంతో పరిసర 70 నుంచి 80 గ్రామాలకు చెందిన ప్రజలకు ఇక్కడకు వచ్చి వినాయక చవితి సామగ్రిని కొనుగోలు చేశారు. దీంతో పట్టణంలోని కేఎన్ రోడ్డు కిక్కిరిసింది. ఇదిలా ఉంటే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో మట్టి విగ్రహాలకే ప్రాధాన్యతనిచ్చి కొనుగోలు చేశారు. అలాగే, విక్రయదారులు సైతం మట్టి విగ్రహాలను మార్కెట్‌లో అందుబాటులో ఉంచారు.




తాడేపల్లిగూడెం పట్టణంలో వినాయక చవితి సామగ్రిని విక్రయిస్తున్న దృశ్యం

పౌష్టికాహారంతో ఆరోగ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ టీఎల్ సరస్వతి అన్నారు. పోషకాహారం మాసోత్సవాలు సందర్భంగా శుక్రవారం స్థానిక యర్రా నారాయణ స్వామి స్కూల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై తల్లులకు అవగాహన కార్యక్రమం జరిగింది. పోషకాహారం తీసుకున్న పిల్లలు యొక్క పెరుగుదల తదితర అంశాలను వెల్లడించారు. సూపర్‌వైజర్లు దుర్గాభావానీ, మంగతాయారు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక 33వ వార్డు గొల్లగూడెంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం, వాటి విలువలు పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పాలు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. బిడ్డ పెరుగుదలకు తప్పక పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.విశాలాక్షి, స్థానికులు, ఏ.ఎన్.ఎం చిన్నపాప, అంగన్‌వాడీలు, ఆశాలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

అత్తిలి: కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కుమారి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా అత్తిలి రైల్వేస్టేషన్ రోడ్డులోగల అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సమావేశం జరిగింది. ఈసందర్భంగా సూపర్‌వైజర్ కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే బాల సంజీవిని కిట్లలో రాగి పిండి, బెల్లం, ఖర్జూరం, చిక్కీలు వంటి పౌష్టికాహార పదార్థాలు వినియోగంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం పదార్థాలను తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎం ప్రసన్న, తల్లులు పాల్గొన్నారు.

ఆరవల్లిలో....

పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఏఎన్ఎం విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ పోషకాహార మాసోత్సవాలలో భాగంగా అవగాహన సమావేశం జరిగింది. అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి మాట్లాడుతూ గర్భం దాల్చిన మూడో నెలలో తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

తణుకు టౌన్: తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వేల్పూరు గ్రామంలో పోషణ మహా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ వీవీకేఎస్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో తల్లులకు పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు.



తాడేపల్లిగూడెం(టీటీసీ) : పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు


అత్తిలి : సమావేశంలో మాట్లాడుతున్న సూపర్ వైజర్ కుమారి

క్రికెట్ ప్రీమియర్ లీగ్ లోగో ఆవిష్కరించిన జ్యోతికశ్రీ


తణుకులో అథ్లెటిక్ జ్యోతికశ్రీని సత్కరిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్ : విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని సాధనచేస్తే తప్పక విజయం సాధిస్తామని పారిస్ ఒలింపిక్స్ పాల్గొన్న అథ్లెటిక్ దండి జ్యోతికశ్రీ అన్నారు. తణుకు భాష్యం స్కూల్‌లో శుక్రవారం క్రికెట్ ప్రీమియర్ లీగ్ లోగో ఆవిష్కరణకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతికశ్రీ మాట్లాడుతూ నేటి కఠోర శ్రమ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు దారి చూపుతుందని, విద్యలోను మనకంటే మెరుగైన వారితో ప్రతిరోజూ పోటీపడితే మన ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీమన్నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జీవీ పాండురంగారావు, ఉపాధ్యాయులు జ్యోతికశ్రీని ఘనంగా సత్కరించారు.